# శృతిలేని రాగం

-విశాల వియోగి.

"హలో శృతీ!' ఆశ్చర్యంగా చూశాడు వినయ్ సినిమా హాల్లో కన్పించిన ఆమె వంక చూస్తూ.

"హాయ్!' అంటూ దగ్గరికి వచ్చింది శృతి' ఇక్కడ-?'

'ప్రస్తుతం ఈ ఊళ్ళోనే ఉన్నాను -ఉద్యోగం చేస్తున్నాను.' చెప్పాడు వినయ్. "వాట్ అబౌట్ యూ?"

"అక్క దగ్గరికి వచ్చాను - పెళ్ళి సంబంధాలున్నా యంటే - "ఎవరికీ - నీకే!" ఆశ్చర్యంగా అడిగాడు.

"వైనాట్...నేను పెళ్ళి చేసుకోకూడదా - సరే... సినిమా అయింతర్వాత కనిపించు - అక్క పిలుస్తోంది.." హడావుడిగా వెళ్ళిపోయింది.

"ఎవర్రా ఆ అమ్మాయి..." లోపలికి రాగానే చెవిలో అడిగాడు మురళి..సినిమా చూస్తూనే...పక్కనే ఎవరూ లేరుకాబట్టి...వివరాలు ఆరా తీశాడు.

"శృతీ...అని యేమ్మెలో నా క్లాస్‌మేట్... చాలా కలుపుకోలుగా ఉంటుందిలే..." వినయ్ చెప్పాడు.

సినిమా అయిన తర్వాత బయటికొచ్చేసరికి ఆమె అక్కతోసహా వినయ్ కోసం ఎదురుచూస్తోంది.

"మురళి.. నా కొలీగ్.. శృతి... నా క్లాస్‌మేట్!" పరస్పర పరిచయాలయ్యాయి. 'మీన మా. అక్క' చెప్పింది.

రాత్రి తొమ్మిదయింది.

"కాఫీ తాగి పోదాం...హోటల్‌కు వెళదామా!" బిడియపడుతూ వినయ్ అడిగాడు శృతి తల ఊపింది.

కానీ మీనా మొహంలో విసుగు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఏం ఫర్వాలేదు...వినయ్‌ని కల్సుకుని చాలాకాలం అయింది. అక్కా! కాఫీ తాగిపోదాం రావే..." చనువుగా ఆమెని లాక్కొచ్చింది హోటల్‌కు.

"టఫిన్!" అడిగాడు వినయ్--

"అబ్బ-కాఫీతో సరిపెడదామనుకున్నావా? ఉద్యోగం చేస్తున్నావుగా... మంచి పార్టీ ఇవ్వాలి... ప్రస్తుతానికి ఒక ఉల్లిపాయ పెసరట్టు చాలు" శృతి అడిగింది.


శృతి చొరవకు మురళి సైతం ఆశ్చర్యపోయాడు.

"ఏవిటే ఆ మాటలు... కొత్తాపాతా లేకుండా.." మందలించింది మీనా చిరుకోపంతో.

"నీకు తెలయదులే అక్కా... అడగందే అమ్మైనా పెట్టదు. ఈ వినయ్ ఒట్టి పిసినారి" చెప్పింది శృతి.

"అన్యాయం... నాతో బిల్లు వదిలిస్తూనే ఆ మాట అనడం ఏం బాలేదు ... మీ బావగారు ఏం చేస్తున్నారు?' ' అడిగాడు వినయ్.

"బావ బ్యాంక్ క్లర్క్, ఈ ఊళ్ళో.. ఆయనకు క్షణం



తీరిక ఉండదు. సినిమాకు రమ్మన్నా రాలేదు" శృతి చెప్పింది.

"దీనికర్థం కాదులేండి.. అన్నట్లు మీకు పెళ్ళయిందా?'

మీనా అడిగింది, వినయ్‌ని.

"పెళ్ళా... అప్పుడే..." సిగ్గుపడ్డాడు వినయ్ శృతిని చూసి...

"మా వాడికి కాలేదు లేండి... తనకు నచ్చిన అమ్మాయి దొరకలేదు..." చెప్పాడు మురళి.

"ఏ దివ్య భారతినో... నగ్మానో ప్రేమించి ఉంటాడు శృతి నవ్వింది గలగలా... వినయ్ కళ్ళల్లోకి చూస్తూ.

బేరర్ ఉల్లిపాయ పెసరట్టు తెచ్చిపెట్టాడు.. నవ్వుతున్న శృతిని ఒక్క క్షణం చూసి వెళ్ళాడు.

శృతి గొప్ప అందగత్తెకాదు.. అట్లాగని అనాకారి కాదు. ఎప్పుడూ మేకప్ చేసుకుని ఉండటం వలన ఆకర్షణీయంగా ఉంటుంది. ఫ్రీగా ఉండే ఆమె మనస్తత్వం అబ్బాయిల్ని ఇట్టే ఆకర్షిస్తుందని మురళి కనిపెట్టాడు.

"ఇంతకూ ఏం చేస్తున్నావు." వినయ్ అడిగాడు.

ప్రస్తుతానికి ఉద్యోగాల వేటలో ఉన్నాను...కానీ రామాయణంలో పిడకలవేటలా... ఇక్కడ సంబంధాలు చూస్తాం. రమ్మని రాస్తే వచ్చాను... బైదిబై... నీ సంగతేంటి?' ' శృతి.

"ఏముంది... నేను ఓ చిన్న స్కూలు టీచర్ని? ట్యూషన్ల మీద కొద్దో గొప్పో సంపాదిస్తున్నాను. మురళి నారూమ్ మేట్! ఇతనూ నా కొలీగే!" చెప్పి కాఫీకి ఆర్డరిచ్చాడు.

శృతికాలేజీ కబుర్లు చెప్పి విరగబడినవ్వుతోంది. అది హోటల్ అన్న స్పృహ ఆమెకున్నట్లు లేదు నలుగురు ఆమెవంకే చూస్తున్నారన్న ధ్యాసలేదు. వినయ్ ఇబ్బంది పడ్డాడు చుట్టూచూసి...

"చిన్నప్పటి నుండి ఇంతేనా?" మీనాను అడిగాడు.

"ఆఁ! వస ఎక్కువ పోసింది మా అమ్మ! చివరిది కదా అని అల్లారు ముద్దుగా పెంచింది. తను ఆడింది ఆట. పాడింది పాట" మీనా చెప్పింది కాఫీకప్పు క్రింద పెడుతూ.

ఆ వాతావరణంలోంచి బయటపడాలని వెంటనే లేచి బిల్లు చెల్లించాడు వినయ్.

శృతి తన బావ విజిటింగ్ కార్డుతీసి ఇచ్చి రేపు రమ్మని చెప్పింది మీనా, శృతి ఇద్దరూ వెళ్ళిపోయారు.

తుఫాన్ వెలసిన హాయి కలిగింది మురళికి.

మరునాడు మురళిని తీసుకుని శృతి ఇంటికి వెళ్ళాడు.

"రండి... నాపేరు రమేష్... శృతి బావని పరిచయం చేసుకుంటూ వీరిని ఆహ్వానించాడు. శృతి మీ గురించి చెప్పింది."

శృతి... మీనా జత అయ్యారు. లోకాభి రామాయణం చాలా జరిగింది. మురళి కూడా కలసిపోయాడు వాళ్ళలో.

"ఓ గంట తర్వాత వెళతాం అనిలేచారు. మిత్రులు... అయ్యో! టిఫెన్ చేయకుండానే... ఈ రాత్రికి మా ఇంట్లో పూరి చేస్తాం తిని వెళుదురు గాని, అసలే బ్రహ్మచారులు మీనా చెప్పింది.

"అబ్బె! ఇప్పుడెందుకండీ శ్రమ" నసిగాడు వినయ్.

"నో...నో... డిసీజ్ మై ఆర్డర్... మా ఇంట్లో తిని తీరాల్సిందే...శృతి వినయ్‌ని ఆజ్ఞాపించి మీనాను తీసుకుని లోనికెళ్ళింది.

"మీరేమనుకొకపోతే... ఓ చిన్నమాట..." రమేష్ అన్నాడు.

'చెప్పండి' వినయ్ చిరునవ్వుతో అడిగాడు.

"శృతికి సంబంధాలు చూస్తున్నాం... మంచి మంచి సంబంధాలు వస్తూనే ఉన్నాయి. కానీ...కాలేజీ.. మీరు... రమేష్ ఆగాడు వినయ్‌కేసి చూశాడు.

మురళి కూడా ఉలిక్కి పడ్డాడు.

...శృతి అంటే మీకు తెగ ఇది అని చెప్పింది.. మీరామెను పెళ్ళిచేసుకోవచ్చు గదా.. ఐమీన్ ఇది నా అభ్యర్థన.." రమేష్ వినయ్ చేతులు పట్టుకున్నాడు.

మురళి ఆ ఐడియా తనకు రానందుకు చింతించాడు వినయ్ వంక చూశాడు ... అతని మొహం ఒక్క క్షణం పాలిపోయింది.

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు... కాలేజీ రోజుల్లో మీరూ... ఇంకో నలుగురు మిత్రులు ఆమె చుట్టూ తిరుగుతుండేవారని నాకు తెల్సింది... అట్లాగని మీకేం అన్యాయం జరగదు. ఆమెకిద్దామనుకున్నంత కట్నం మీకూ ఇస్తాం... ఎలాగూ తను ఉద్యోగం చేస్తుంది.' రమేష్ ప్రాధేయపడ్డాడు.

ఇంత గొప్ప ఛాన్స్ వినయ్‌కి తగిలినందుకు... మురళికి సంతోషం కలిగింది. అతనూ ఎన్నో సంబంధాలు చూశాడు ఏదీ నచ్చలేదు.

"సారీ! ఆలస్యం అయింది. ఇప్పుడు నా చేతుల్లో ఏమీలేదు నా పెళ్ళి నిశ్చయమైపోయింది" వినయ్ చెప్పాడు.

"ఈజిట్... నిశ్చయమైపోయిందా?" విచారంగా అడిగాడు రమేష్.

"యస్... ఒక్కవారం క్రిందట మీరు అడిగి ఉంటే' వినయ్.

"మాకు ప్రాప్తంలేదు." రమేష్ బాధపడ్డాడు.

లోపల గిన్నెలు క్రిందపడ్డచప్పుడు...

"మళ్ళీ కలుద్దాం..." వినయ్ లేచాడు మురళిని తట్టి. రమేష్ అభ్యంతరం చెప్పలేదు.

"ఎందుకురా అబద్ధం చెప్పావు?" బాధపడ్తూ అడిగాడు మురళి.

"నేను సగటు భారతీయ యువకుణ్ణిరా! మొగాళ్ళతో ఫ్రీగా ఉండే అమ్మాయితో స్నేహం చేయగలను కాని.. పెళ్ళి చేసుకోలేను...నా భార్య పరాయివాళ్ళతో మాట్లాడితే భరించలేను" వినయ్ అన్నాడు.

'శృతిలేని రాగాన్ని ఎవరు హర్షిస్తారులే' సమర్థించాడు మురళి.


కె.విశాల,

వైఫాఫ్:విజయప్రసాద్ కె.

ఏ.ఏ.ఓ, జీవిత భీమా సంస్థ

కర్నూలు - 518 002.